
# ఆకలీ! నీకు జోహార్లు!!

సుజయశ్రీ




ఎక్స్‌ప్రెస్ అమిత వేగంతో ముందుకు పరుగెడుతూంది. రైలు చక్రాల శబ్దం తప్ప కంపార్టుమెంటులో మరే శబ్దమూ రావడం లేదు.

రైలు వేగం తగ్గడంతో కునికిపాట్లు పడుతున్న వారికి మెలకువ వచ్చింది. ఏదో స్టేషన్ వస్తున్నట్లుంది. విశాలంగా పరుచుకున్న చీకట్లో అక్కడక్కడా చలికి వణుకుతూ మసక మసకగా లైట్లు వెలుగుతున్నాయి.

కొంత సేపటికి ప్లాట్ ఫారం మీద ఆగింది రైలు. అంతవరకూ నిశ్శబ్దం రాజ్య మేలిన ఆ కంపార్టుమెంటులో చిన్నగా కదలిక ప్రారంభమయింది.

అది చిన్న స్టేషను కావడం వల్ల ప్లాట్ ఫారం మీద ప్రయాణీకులు ఎక్కువగా లేరు.

రైలు కదల బోతుండగా ఆ కంపార్టుమెంట్‌లోకి ఒక లెదర్ సూట్‌కేసుతో పాతికేళ్ళఅమ్మాయి కంగారుగా ఎక్కింది. అది లేడీస్ కంపార్టుమెంటు కావడంతో అందరూ ఆడవాళ్ళే ఉన్నారు.

సూట్‌కేసును పై బెర్తు మీద ఉంచి కిటికీ పక్కన కూర్చుంది ఆమె. ఆమె ముఖంలో అలసట స్పష్టంగా కనిపిస్తూంది. రైలు అందుతుందో, లేదో అని కంగారుగా రావడంతో కాబోలు చలికాలమైనా ఆమె నుదుటి మీద చిన్న చిన్న స్వేదబిందువులు ఏర్పడ్డాయి. విశాలమైన కళ్ళు, చక్కని ముక్కు, వేటగాడి విల్లులా వంగిన పెదాలు, శంఖంలాంటి మెడ, ఆడవాళ్ళకే అసూయ కలిగించేంతటి అందంగా ఉం దామె.

కంపార్టుమెంటులో దాదాపు అందరూ ఆమెనే చూస్తున్నారు. కాస్త ఇబ్బందిగా కదిలిం దామె.

"ఏవూరు వెళుతున్నా వమ్మాయ్?" అడిగిం దొకామె.

"రాజమండ్రి." జవా బిచ్చిం దామె.

అంతవరకూ ఆమె అందాన్నే చూస్తున్న ఆడవాళ్ళ చూపులు ఆమె నగల మీద పడ్డాయి. మెడలో రెండు నెక్లెసులు. చేతులకు ఎనిమిదేసి బంగారు గాజులు. చేతి వేళ్ళకు రెండు ఉంగరాలు. ఎర్రటి రాయి పొదిగి ఉన్న ముక్కుపుడక. చెవి రింగులు. వీటివైపే చూస్తున్నా రంతా.

ఆడవాళ్ళకున్న బలహీనతలలో నగలు ఒకటి. అవి కంట పడితే గంటల తరబడి వాటిగురించి చర్చావేదికను నిర్వహిస్తారు. ఆ నగలు ఒక్కొక్కటి ఎంత ఖరీదు అయిందనీ, ఎక్కడ కొన్నావని ఆమె మీద ప్రశ్నల వర్షం కురిపించ సాగారు.


"అమ్మాయ్! నీ పేరేంటి?" నగల మీద నిర్వహింపబడుతున్న చర్చా వేదికను భంగపరుస్తూ అడిగిం దొక బామ్మ.

అందరి ముఖాలు బామ్మగారి వైపు తిరిగాయి.

"నా పేరు నిర్మలండీ!" జవా బిచ్చిం దా అమ్మాయి.

"ఒక్కదానివే ప్రయాణం చేస్తున్నావా?" నోట్లోని తమలపాకు రసాన్ని కిటికీ లోంచి బయటికి తుపుక్కుమని ఉమ్మేసి అడిగింది బామ్మ.

"లేదండీ. మా వారుకూడా ఉన్నారు. వేరే కంపార్టుమెంటులో స్థలం లేక నన్ను లేడీస్ కంపార్టుమెంటులో ఎక్కించారు."







నగల మీద జరుగుతున్న చర్చ మధ్యలో పానకంలో పుడకలా వచ్చిన బామ్మగారి వైపు ఆడవాళ్ళంతా విసుగ్గా చూస్తున్నారు.

"చూడమ్మాయ్! నీ ఒంటి మీద ఉన్న నగలన్నీ తీసి సూటుకేసులో పెట్టేయ్" అంది బామ్మ.

"ఎందుకండి?" అమాయకంగా అడిగింది నిర్మల.

"ఈ దారిలో రాత్రిపూట ప్రయాణం చేస్తున్న రైళ్ళ మీదికి ఈ మధ్య దిలావర్‌సింగ్ అనే బందిపోటు నాయకుడు దాడి చేస్తున్నాడు. ఆడవాళ్ళ కంపార్టుమెంటులో ప్రవేశించి నగలను, డబ్బును దోచుకుని మూడో కంటి వాడికి తెలియకుండా పారిపోతుంటాడు." బామ్మగారు వూపిరి పీల్చుకోవడానికి ఆగారు.

అంతవరకూ సరదాగా కబుర్లు చెప్పుకున్న ఆడవాళ్ళు తమ శరీరంలోకి ఎవరో భయాన్ని ఇంజెక్టు చేసినట్లు భావించారు.

"అన్నట్టు మరో విషయం చెప్పడం మరిచాను. నువ్వు కట్టుకున్న ఎర్ర చీరను విప్పేసి మరో చీర కట్టుకో" అన్నారు బామ్మగారు.

"అదెందుకండి?" భయం వల్ల కాబోలు నిర్మల గొంతు సన్నగా వణుకుతూంది.

"దిలావర్‌సింగ్ బందిపోటుగా మారడానికి కారణం ఒక అమ్మాయి అట. అతణ్ణి ప్రేమించి చివరి క్షణంలో మరో డబ్బున్న కుర్రాడిని పెళ్ళి చేసుకోవడం వల్ల అతని మనసు వికలమై బందిపోటుగా తయారయ్యాడట. పెళ్ళి రోజు రాత్రి ఎరుపురంగు బట్టలలో ఉన్న తన ప్రియురాలిని కత్తితో ముక్కలు ముక్కలుగా నరికి తన కసి తీర్చుకుని ఆ నాటి నుంచి తన బందిపోటు జీవితాన్ని ప్రారంభించాడు. అందుకే తరుచు ఆడవాళ్ళ కంపార్టుమెంటులో ప్రవేశించి నగలు, డబ్బు దోచుకున్నాక, ఎరుపు రంగు బట్టలతో కొత్తగా పెళ్ళయిన ఆడవాళ్ళు ఎవరయినా ఉంటే వారిని చంపి కానీ బయటి కెళ్ళడు. అతను ఎలా ఉంటాడో, అతని అసలు పేరేమిటో పోలీసులకుకూడా తెలియదట!" అంది బామ్మ.

ఆడవాళ్ళందరూ వూపిరి పీల్చుకోవడం కూడా మరిచిపోయి భయంతో అలాగే కూర్చుండి పోయారు. అయిదు క్షణాలు అయిదు యుగాల్లా గడిచాయి.

ఒక బెర్తు కింద ఏదో అలికిడి అయింది. అందరి చూపులు ఆ బెర్తు కింది వైపుకు తిరిగాయి. ఆ బెర్తు కింది నుంచి ఒకతను మెల్లిగా బయటి కొచ్చాడు.

అందరి ముఖాల్లోనూ ఆశ్చర్యం, భయం, ఏడుపు ఆక్రమించుకున్నాయి.

అతని బట్టలు పూర్తిగా దుమ్ము కొట్టుకుని ఉన్నాయి. ముఖం నిండా జిడ్డు కారుతూంది. పెరిగిన గడ్డంతో భుజాల చుట్టూ ఒక పాత శాలువా కప్పుకుని చూడగానే పిల్లలు జడుసుకునేలా భయంకరంగా ఉన్నాడు.

"ఎవరయినా అరిచారో ప్రాణాలు తీసేస్తాను." ఆ నిశ్శబ్ద వాతావరణంలో అతని కంఠం ఖాళీ డబ్బాలో రాళ్ళు వేసి ఆడించినట్లు గురగరమంటూ వినిపించింది.

"మీ రింతవరకూ ఎవరి గురించి అయితే మాట్లాడు తున్నారో ఆ దిలావర్ సింగ్‌ని నేనే!" అన్నాడతను అందరి వైపూ చూస్తూ.

ఒకేసారి పది న్యూట్రాను బాంబులు పేలినట్లు ఫీలై బిర్ర బిగుసుకుని పోయారు ఆడవాళ్ళంతా.

"మీ దగ్గర తినడాని కేమయినా ఉందా?" అడిగాడతను.

ఎవరూ మాట్లాడడానికి సాహసించడం లేదు. దిలావర్‌సింగ్ గురించి అంతవరకు చెప్పిన బామ్మగారు మూర్ఛపోయి చాలా సేపయింది.

"ఎవరూ పలకరేం? మీ దగ్గర తినడాని కేమయినా ఉందా?" అతని ప్రతి మాటలోనూ పులి గాండ్రింపు వినిపిస్తూంది.

ముగ్గురు ఆడవాళ్ళు రక్కున లేచి తమ దగ్గరున్న స్వీట్ పాకెట్లను, పూరీ, సాగ్ పొట్లాలను, పులిహోర ఉన్న క్యారియర్‌ను అతనికి అందించారు.

వాటిని అందుకుని నిలబడే గబగబా తినసాగాడతను. తింటుంటే అతని చేతి వేళ్ళు వణుకుతున్నాయి. అందరూ అతని వైపు భయం నిండిన కళ్ళతో చూస్తున్నారు.

రైలు వేగం కొంచెం తగ్గినట్లు అనిపిస్తే కిటికీ పక్కన కూర్చున్న ఆవిడ తల తిప్పకుండా కళ్ళు మాత్రమే తిప్పి బయటికి చూసింది. దూరంగా మినుకు మినుకు మంటూ వెలుగుతున్న లైట్లు కనిపించాయి. ఏదో స్టేషను వస్తున్నట్లుంది. ఆవిడ ముఖంలో భయం తగ్గి, ధైర్యం చోటు చేసుకోసాగింది.

అతను తినడం ముగించి నీళ్ళిమ్మని సైగ చేశాడు. పై బెర్తు మీదున్న తన వాటర్ బాగ్‌ను అందించింది ఒకామె. వాటర్ బాగ్ అందుకుని గటగటా మని నీళ్ళు తాగసాగా డతను.

రైలు వేగం మరింత తగ్గింది. దూరంగా ప్లాట్ ఫారం కనిపిస్తూంది.

నీళ్ళు తాగడం ముగించి, శాలువాతో పెదవులు తుడుచుకుంటూ అందరి వైపు చూశాడతను. రెండు క్షణాల తరవాత తలుపు వైపు నడుస్తున్న వాడల్లా ఆగి, వెనక్కి తిరిగి, "నేను మీ రను కుంటున్నట్లు బందిపోటు దిలావర్‌సింగ్‌ను కాను. ఎమ్. కామ్. లో గోల్డ్ మెడల్ సంపాదించుకున్నా, ఆరేళ్ళుగా ఒక చిన్న గుమాస్తా ఉద్యోగాన్ని కూడా సంపాదించుకోలేక పోయిన నిరుద్యోగిని. ఉద్యోగం వస్తుందన్న నమ్మకం పోయి పిచ్చి పట్టిన వాడిలా ఇలా రైళ్ళలో తిరుగుతున్నాను. అయిదు రోజులుగా ఏమీ తినని కారణంగా బతుకు మీద కూడా ఆశ చచ్చి, ఈ రైలు బయలు దేరినప్పటినుంచి ఆ బెర్తు కింద అలాగే పడుకుని ఉన్నాను. మీరు దిలావర్‌సింగ్ అనే బందిపోటు గురించి మాట్లాడిన మాటలన్నీ విని, ఇక ఆకలిని భరించే శక్తి లేక నేనే దిలావర్‌సింగ్ అని మిమ్మల్ని భయపెట్టి నా ఆకలి తీర్చుకున్నాను" అని చెప్పి తలుపు తీసి ఆ చీకట్లోనే రైలు మీంచి కిందికి దూకగానే రైలు దడ దడ శబ్దం చేస్తూ ప్లాట్‌ఫారంలోకి ప్రవేశించింది. ★